క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి మండల సర్వ సభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీపీ రాజు గురువారం తెలిపారు. ఎంపీపీ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. ఎంపీటీసీలు అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

జూలై 1న..

నర్సాపూర్: మండల ప్రజాపరిషత్తు సర్వసభ్య సమావేశం జూలై ఒకటిన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మధులత చెప్పారు. ఎంపీపీ అధ్యక్షురాలు జ్యోతి అధ్యక్షతన ఆరోజు ఉదయం 11గంటలకు జరుగుతుందని, సభ్యులు సకాలంలో రావాలని ఆమె సూచించారు.

'ఆన్‌లైన్'తో గందరగోళం



రమేశ్

కౌడిపల్లి(నర్సాపూర్): ఎస్‌జీటీ ఉపాధ్యాయుల బదిలీలు ఆన్‌లైన్‌లో చేపట్టడం వల్ల గందరగోళం ఏర్పడుతోందని ఆఫ్‌లైన్‌లోనే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి పరికి రమేశ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల జాబితా సీనియారిటీ లిస్టులో 1000 నెంబర్‌లో ఉంటే వెబ్ ఆప్షన్‌లు వెయ్యి ఇవ్వాల్సి వస్తోందని దీంతో చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి బదిలీలు ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వనమహోత్సవానికి ఏర్పాట్లు



గుంతలు తీస్తున్న కూలీలు

పెద్దశంకరంపేట(మెదక్): త్వరలో ప్రారంభం కానున్న వనమహోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలు, రహదారులకు రెండువైపులా మొక్కలు నాటేందుకు అధికారులు ఉపాధిహామీ కూలీలతో గుంతలు తీసే పనులు చేపట్టారు. ఆయా పనులను ఈజీఎస్ ఏపీఓ నవాజొద్దీన్ గురువారం పరిశీలించారు.

వేలం వాయిదా

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి పంచాయతీ పరిధిలో నూతనంగా ప్రారంభించనున్న గొర్రెలు, మేకల సంతకు సంబంధించి గురువారం నిర్వహించిన తైబజార్ వేలంపాట వాయిదా వేశారు. 9నెలల కాలానికి సంబంధించి కనీస ధర రూ.లక్ష ఉండడంతో ప్రజల నుంచి ఆసక్తి కరువైంది. దీంతో కనీస ధర తగ్గించి 29న మరోసారి వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి బలరామ్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



కొల్చారం(నర్సాపూర్): మండలంలో తుక్కాపూర్ గ్రామానికి చెందిన ఆయిలి రవి ఆరు నెలలుగా కనిపించకుండా పోయాడని అతడి భార్య భాగ్యలక్ష్మి గురువారం తెలిపింది. తన భర్తకు 38ఏళ్లు ఉంటాయని, ఆచూకీ తెలిసినవారు 72880 05018 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరింది.

ప్రగతి ధర్మారంలో బడిబాట



ర్యాలీలో విద్యార్థులు

రామాయంపేట(మెదక్): మండలంలోని ప్రగతి ధర్మారంలో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాజాత బృందం పాటలు పాడి అలరించింది. ఐకేపీ సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించనట్లు కార్యదర్శి తెలిపారు.

న్యాయం చేయండి

మెదక్ కలెక్టరేట్: తన ఇంటి గోడను, ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకొని ఇంటి నిర్మాణం చేపట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఫతేనగర్ వీధికి చెందిన భిక్షపతి కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు అందజేసినట్లు చెప్పారు. ఆయన మాట్లాడుతూ సున్నం రాంచందర్ తన ఇంటి గోడను ఆక్రమించుకొని ఇంటి నిర్మాణం చేస్తుండటంతో తన ఇల్లు కూలిపోయే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మున్సిపల్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకో లేదని ఆరోపించారు. రాంచందర్‌పై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

కోమటికుంట కబ్జా

పట్టణంలోని చౌరస్తా సమీపంలో నర్సాపూర్–తూప్రాన్ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కోమటికుంట రూపురేఖలు మారిపోతున్నాయి. ఒక వైపు యథేచ్ఛగా ఆక్రమణలు కొనసాగుతున్నాయి. మరో వైపు మున్సిపల్ అధికారులే మురుగు నీటిని మళ్లించడంతో మురుగుమయంగా మారుతోంది. కుంటను కాపాడాల్సిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. మాజీ ఎమ్మెల్యే కుంటను సుందరీకరించి వాకింగ్ ట్రాక్ నిర్మిస్తానన్నా అది జరగలేదు. భవిష్యత్తులో కుంట మాయమైపోతుందనే ఆవేదన స్థానికుల నుంచి వినిపిస్తోంది.

– నర్సాపూర్

- నిత్యం చేరుతున్న మురుగు
- దుర్గంధంతో స్థానికుల వెతలు
- జోరుగా ఆక్రమణలు
- పట్టించుకోని అధికారులు



మట్టి పోయడంతో పూడ్చుకుపోతున్న కుంట

రహదారిని ఆనుకుని ఉండడంతో కోమటి కుంట ప్రాంతంలో భూమి ధర గజానికి రూ.50వేలకు పైనే ఉంది. దీంతో అక్రమార్కులు కుంట జాగాపై కన్ను వేశారు. అన్ని వైపులా మట్టి, చెత్తాచెదారంతో నింపి ఆక్రమించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ప్రధాన రోడ్డువైపు పెద్దఎత్తున మట్టిపోసి పూడ్చారు. పాత ఇండ్లు కూల్చగా వచ్చిన మట్టితోపాటు చెత్తాచెదారం తెచ్చి కుంటలో పోస్తున్నారు. కొందరైతే కుంటను ఆక్రమించి పలు డబ్బాలు ఏర్పాటుచేసి వ్యాపారాలు సాగిస్తున్నారు.

కుంటలోకి మురుగునీరు

శ్రీరాంనగర్ కాలనీకి చెందిన పలు ఇండ్ల నుంచి వచ్చే వాడుక నీటిని మున్సిపాలిటీ అధికారులు కోమటికుంటలోకి వెళ్లే విధంగా డ్రైనేజీ నిర్మించారు.



మూల మలుపు వద్ద చెత్త చెదారం

ఆ నీరు నేరుగా కుంటలోకి వచ్చి చేరుతోంది. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుంటలోకి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని, కుంట చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించి సుందరీకరించాలని కోరుతున్నారు.



కుంటలోకి ప్రవహిస్తున్న మురుగునీరు

పట్టించుకోని అధికారులు..

రాబోయే కాలంలో కోమటికుంట భౌగోళిక స్వరూపం మారిపోనుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి పారుదల, మున్సిపల్, టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిధులు రాగానే ప్లాంటు నిర్మిస్తాం



కోమటికుంటలోకి మురుగు నీటిని తప్పనిసరి పరిస్థితులలో పంపుతున్నాం. వేరే వైపునకు పంపే వీలులేదు. కుంట సమీపంలో సీవరేజ్ ట్రీట్‌మెంటు ప్లాంటు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినం. నిధులు రాగానే ప్లాంటు నిర్మించి మురగునీరు కుంటలోకి వెళ్లకుండా చర్యలు తీసుకుంటాం.

– అశోక్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్

ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం



కోమటికుంటను కాపాడేందుకు చర్యలు తీసుకుంటాం. రోడ్డు వైపు ఆక్రమిస్తున్న వారిపై త్వరలో పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. చెత్తాచెదారం కుంటలో వేయవద్దని, మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ అధికారులకు గతంలో చెప్పినా ప్రయోజనం లేదు. మరోసారి లేఖరాస్తాం.

– మణిభూషణ్, ఏఈ, సాగు నీటిపారుదలశాఖ, నర్సాపూర్

తాగునీటి సమస్య రావొద్దు



మాట్లాడుతున్న అదనపు ఈఈ కిషన్

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాలు, తండాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ కిషన్ అధికారులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో ఎక్కడా లీకేజీలు లేకుండా చూడాలన్నారు. లీకేజీలు, గుంతలు, ఇతర సమస్యలుంటే త్వరగా మరమ్మతులు పూర్తిచేయాలని, ప్రతి కుటుంబానికి భగీరథ తాగునీటిని అందించాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాలలో సంపూర్ణ పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. డ్రైనేజీలు శుభ్రం చేయించాలని, పిచ్చిమొక్కలు, పొదలు తొలగించాలని ఆదేశించారు. మొక్కలు నాటే కార్యక్రమానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీని తరలించాలని తీర్మానం



సభలో పాల్గొన్న గ్రామస్తులు

మనోహరాబాద్(తూప్రాన్): ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని రెండు గదులలో కొనసాగుతున్న పంచాయతీని వేరేచోటకు తరలించాలని కాళ్లకల్ గ్రామస్తులు గ్రామసభలో తీర్మానం చేశారు. కాళ్లకల్ కార్యదర్శి రాజు ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు సంవత్సరాలుగా పంచాయతీ భవనం లేకపోవడంతో ఉన్నత పాఠశాలలోని రెండు గదులలో కొనసాగిస్తున్నారని, దీంతో విద్యార్థులకు సమస్యలు తప్పడం లేదని పలువురు గ్రామస్తులు వాపోయారు. ఇప్పటికే పాఠశాలలో 450మంది విద్యార్థులున్నారని, వారికి గదులు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీకి నిత్యం వస్తున్న వారితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పంచాయతీని అక్కడి నుంచి తరలించాలని కోరారు. అంతేకాకుండా లక్షలు వెచ్చించి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమేరాలు పనిచేయడం లేదని, వాటి నిర్వహణను పట్టించుకోవడం లేదని వాపోయారు. వర్షాకాలం కావడంతో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



మాత్రలు వేస్తున్న వైద్యసిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): వివిధ గ్రామాలలోని పాఠశాలల విద్యార్థులకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 1 నుంచి 19యేళ్ల వయస్సుగల వారు 19,117 మంది ఉండగా గత వారం 16,988 మందికి మాత్రలు పంపిణీ చేశామన్నారు. ఆరోజు మాత్రలు వేసుకోని విద్యార్థులకు ఇప్పుడు పంపిణీ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు 2,128 మంది విద్యార్థులకు మాత్రలు వేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఉచితంగా ఈ మాత్రలు పంపిణీ చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలం రామంతాపూర్ తండా ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విఘ్నేశ్వర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. చిన్నారులకు వసతులు కల్పిస్తున్న జీఎంఆర్ సంస్థ సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో హెచ్ఎం నవీన్‌కుమార్, సంస్థ ప్రతినిధి శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్‌లో..

పట్టణ పరిధిలోని ఏడో వార్డు అల్లాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వార్డు కౌన్సిలర్ జిన్న భగవాన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందేలా అంగన్‌వాడీ టీచర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వెల్దుర్తి(తూప్రాన్): చిన్నారులతో ఎంపీడీఓ విఘ్నేశ్వర్, హెచ్ఎం నవీన్ కుమార్ తదితరులు

కొనసాగుతున్న భగీరథ సర్వే



సర్వే చేస్తున్న కార్యదర్శి

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఇంటింటికీ భగీరథ తాగునీరు సక్రమంగా సరఫరా అవుతుందా లేదా అనే అంశంపై కార్యదర్శులు సర్వే చేపట్టారు. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో గురువారం కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి నల్లా, ఆధార్ కార్డులను పరిశీలించి ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. శనివారంలోగా సర్వేను పూర్తి చేయనున్నట్లు ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా తెలిపారు.

మట్టి తరలిస్తున్న కంటైనర్ పట్టివేత

- ఇద్దరిపై కేసు నమోదు



అధికారులు పట్టుకున్న కంటైనర్

మనోహరాబాద్(తూప్రాన్): ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 209 నుంచి మట్టిని తరలిస్తున్న ఓ కంటైనర్‌ను పట్టుకున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మట్టి రవాణా చేస్తున్నారనే సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి అడ్డుకున్నామన్నారు. ఆ సమయంలో రెవెన్యూ సిబ్బందిపై దాడికి ప్రయత్నించి, దూషించిన పిట్ల కృష్ణ, కుమ్మరి నాగేష్‌లపై ఫిర్యాదు చేసి, కంటైనర్‌ను పోలీసులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. అక్రమంగా మట్టిని తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులతో ట్రస్ట్ సభ్యులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ధరిపల్లి జెడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు హార్ట్ టు హార్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. గురువారం పాఠశాలలోని మొత్తం 37మంది విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను అందించారు. వార్షిక పరీక్ష ఫీజు, ఎగ్జామ్ కిట్‌లను అందించనున్నట్లు ట్రస్ట్ నిర్వాహకుడు రవి నాయక్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ వసతి కల్పిస్తాం



శ్రీనివాస్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని సంగాపూర్ మార్గంలోగల బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోని కళాశాలలో డిగ్రీలో చేరే విద్యార్థినులకు హాస్టల్ వసతి కల్పిస్తామని గజ్వేల్ ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యాసంవత్సరంలో గజ్వేల్ బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోని బాలుర డిగ్రీ కళాశాలలో కో ఎడ్యుకేషన్‌ను పునఃప్రారంభించామన్నారు. దోస్త్ ద్వారా గజ్వేల్ డిగ్రీ కళాశాల 16019 కోడ్‌తో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ హాస్టల్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు.

కొత్తిమీర పంటపై విషప్రయోగం



ఎండిపోయిన కొత్తిమీర సాగు

హవేళిఘణాపూర్(మెదక్): తన కొత్తిమీర పంటపై విషప్రయోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గుట్టకిందిపల్లికి చెందిన రైతు ఏగొండ స్వామి ఫిర్యాదు చేసినట్లు ఏఎస్ఐ శివకుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. స్వామి తనకున్న 20 గుంటల పొలంలో రూ.40వేలు వెచ్చించి కొత్తిమీర సాగు చేశాడు. అయితే మంగళవారం గుర్తు తెలియని దుండగులు గడ్డిమందు పిచికారీ చేయడంతో పూర్తిగా ఎండిపోయింది. రూ.2లక్షల ఆదాయం చేతికి అందివచ్చే సమయంలో తమ పంటను నాశనం చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం ఫిర్యాదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

వృద్ధుడి మెడలోంచి గొలుసు అపహరణ



బాధితుడు వీరయ్య

తూప్రాన్: సినీ పక్కీలో వృద్ధుని మెడలోంచి మూడు తులాల బంగారు గొలుసు అపహరణ జరిగిన ఘటన పట్టణ కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. కోనాయిపల్లి(పీటీ) గ్రామానికి చెందిన నర్రా వీరయ్య అనే వృద్ధుడు హైదరాబాద్‌లోని రైతుబజార్‌లో కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. రోజూ మాదిరిగా తూప్రాన్ పట్టణంలో నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి రూ.5వేలు కావాలని డిమాండ్ చేశారు. అనంతరం బలవంతంగా వృద్ధుడి మెడలోంచి బంగారు గొలుసు లాగుకొని దుండగులు పరారయ్యారు. వెంటనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరాలు పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

నిధులున్నా.. నిర్మాణం సున్నా..

- శాపంగా మారిన రహదారి విస్తరణ
- పాఠశాల, అంగన్‌వాడీ భవనాల తొలగింపు
- రూ.50.25లక్షలు కేటాయింపు
- ముందుకు రాని కాంట్రాక్టర్లు
- ఇబ్బందుల్లో విద్యార్థులు, సిబ్బంది



భవనాల నిర్మాణానికి కేటాయించిన స్థలం ఇదే..

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో నిర్వాహకులు, విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఐదేళ్ల క్రితం 161వ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఇసుకపాయతండా పరిధిలోని రాఘవానితండాలో పాఠశాల, అంగన్‌వాడీ భవనాలను తొలగించారు. ఆ భవనాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కాని అప్పటి నుంచి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభానికి కూడా నోచుకోలేదు. 161వ జాతీయ ప్రధాన రహదారి(అకోలా–నాందేడ్- సంగారెడ్డి) విస్తరణలో భాగంగా అప్పట్లో అడ్డుగా ఉన్న ఈ భవనాలను, మరో 20 ఇళ్లను కూడా తొలగించారు. ఇళ్లు నష్టపోయిన వారికి డబుల్‌బెడ్రూం ఇళ్లను మంజూరు చేసి నష్టపరిహారం అందజేశారు.

కమ్యూనిటీ హాల్లోనే కొనసాగింపు

ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ భవనాల పునఃనిర్మాణానికి రూ.50.25లక్షలు ప్రభుత్వం టీఎస్ఈడబ్ల్యూఐడీసీ ద్వారా మంజూరు చేసింది. అనేక ఇబ్బందులు అనంతరం స్థలాన్ని కూడా ఏర్పాటు చేసింది. కానీ కాంట్రాక్టర్లు మాత్రం ముందుకు రాకపోవడంతో నిర్మాణం ప్రారంభం కాలేదు. ప్రస్తుతం తండా పరిధిలోని కమ్యూనిటీహాల్‌లోని రెండు గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. గదులు చాలకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల ఇబ్బందులు తీర్చాలి

జాతీయ రహదారి విస్తరణలో పాఠశాల, అంగన్‌వాడీ భవనాన్ని తొలగించారు. స్థలం ఉన్నా పనులు పూర్తి కావడం లేదు. కమ్యూనిటీహాల్ సరిపోకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి భవనాల నిర్మాణ పనులు పూర్తిచేసి వినియోగంలోనికి తేవాలి.

– సుభాష్, మాజీ సర్పంచ్, ఇసుకపాయతండా

ఉన్నతాధికారులకు నివేదించాం

ఆ భవనాలు నిర్మాణానికి ఇప్పటి వరకు పలుమార్లు టెండర్లను ఆహ్వానించినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు, ఎమ్మెల్యే సంజీవరెడ్డికి విన్నవించాం. త్వరలో పనులు ప్రారంభించి పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం.

బుచ్చానాయక్, ఇన్‌చార్జి ఎంఈఓ, పెద్దశంకరంపేట